- పండు దశలో నేలపాలైన బొప్పాయి



నిజామాబాద్ జిల్లా భిక్కనూరు మండలం లక్ష్మీదేవునిపల్లిలో రాలి పడిన బొప్పాయి

- పూత దశ నుంచి కాపాడితే.. కాయలయ్యేసరికి నేలరాలే



మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం రాపల్లిలో నేల రాలిన మామిడికాయలు



మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలో వర్షానికి నేలకొరిగిన వరి పంట

# ఒరిగిన వరి.. నేలపాలైన మక్క

అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలు

ప్రభుత్వమే ఆదుకోవాలంటున్న రైతులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, మార్చి 22: ఇప్పటికే సాగునీరు లేక అల్లాడుతున్న రైతన్నలను అకాల వర్షాలు నిండాముంచాయి. ట్యాంకర్లను తెచ్చి మరీ పంటలను కాపాడుకుంటుంటే ఈ వర్షాలు కాస్త నేలపాలు చేశాయి. ముఖ్యంగా వరి, మక్కజొన్న పంటలు నేలకొరిగాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ధర్పల్లి, సిరికొండ, నిజామాబాద్ రూరల్, బోధన్, రాజంపేట్, భిక్కనూరు, సదాశివనగర్ తదితర మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. సారంగపూర్ మండలం పాల్దలో వరి పైర్లు నేలకొరిగాయి. వాడీ, దమ్మన్నపేట్ గ్రామాల్లో 174 మంది రైతులకు చెందిన 265 ఎకరాల వరి పంటకు నష్టం వాటిల్లిందని రూరల్ ఏడీఏ ప్రదీప్‌కుమార్ తెలిపారు. రాజంపేట మండలంలో మక్కజొన్నకు తీవ్ర నష్టం వాటిల్లింది. తలమడ్ల, ఆరెపల్లి, ఆర్గొండ, బస్వన్నపల్లి గ్రామాల్లో 26 ఎకరాల్లో నష్టం జరిగిందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.



నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం వాడీ-సీతాయిపేట్ శివారులో నేలరాలిన ధాన్యం

భిక్కనూరు మండలం లక్ష్మీదేవునిపల్లిలో బొప్పాయి తోటకి తీవ్ర నష్టం వాటిల్లింది. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలో 70 ఎకరాల్లో మక్క, 70 ఎకరాల్లో వరి పంటలకు నష్టం వాటిల్లింది. దండేపల్లి మండలంలో 7 గ్రామాల్లో 86 ఎకరాల్లో మక్క పంట దెబ్బతిన్నదని అధికారులు తెలిపారు.

### అన్నదాతలను ఆదుకోండి: సుంకె

చొప్పదండి, మార్చి 22: కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో శుక్రవారం కురిసిన అకాల వర్షానికి నేలకొరిగిన పంటలకు ప్రభుత్వం రూ.20 వేల నష్ట పరిహారం చెల్లించి, అన్నదాతలను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. చొప్పదండి మండలంలో అకాల వర్షానికి నేలకొరిగిన పంటలు, చొప్పదండి వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని శనివారం ఆయన బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు.

- పటపటా రాలిన వరి కంకులు



నిజామాబాద్ జిల్లా పాల్దాలో ఈదురుగాలులకు నేలకొరిగిన వరి పంట

- ఎకరాలకెకరాలు నేలకొరిగె



కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలో దెబ్బతిన్న మక్కజొన్న

- మక్కలు ముక్కలాయె



కరీంనగర్ జిల్లా చొప్పదండిలో నేలకొరిగిన మక్కజొన్న పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్‌ఎస్ నాయకులు



## నేడు ఉరుములతో కూడిన వర్షం

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అంచనా వేసింది. మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్‌భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, జనగాం జిల్లాల్లో అక్కడక్కడ వడగండ్ల వాన కురిసే అవకాశం ఉన్నట్టు తెలిపింది. గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నదని పేర్కొంది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, ములుగు, భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబగద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉన్నట్టు తెలిపింది. ఏడు జిల్లాలకు ఆరెంజ్, 22 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# నీళ్లు లేక ఇల్లిడిసిపోతున్నం!

- కాల్వల్లో నీళ్లు లేక.. మళ్లీ వలసలు
- ఎండిన వరి.. బోర్లతో కుదేలు
- మారుతున్న పల్లెల ముఖచిత్రాలు
- సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలో 85 శాతం ఎండిన కాళేశ్వరం ఆయకట్టు
- 67 కుటుంబాలు ఉన్న రత్యా తండాలో 40 కుటుంబాల వలస



సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం రత్యాతండాలో ఎండిన వరి పంట

సూర్యాపేట, మార్చి 22 (నమస్తే తెలంగాణ): సాగు నీళ్లు లేక రైతులు తల్లడిల్లిపోతున్నారు. కాళేశ్వరం కాల్వల్లో నీళ్లు పారక.. పంటలు పండక రైతులు అన్ని విధాలా నష్టపోతున్నారు. పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోవడమేగాక బతుకు దెరువు కోసం రైతులు మళ్లీ వలసబాట పట్టారు. ఉమ్మడి రాష్ట్రంలోని పరిస్థితులు మళ్లీ దాపురించాయని గుర్తుచేసుకుంటున్నారు సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని రత్యా తండా రైతులు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వద్దన్నదాకా నీళ్లను పారించిన కాళేశ్వరం ప్రాజెక్టును రేవంత్‌రెడ్డి సర్కారు పండ బెట్టడంతో సూర్యాపేట జిల్లా రైతాంగం అల్లాడిపోతున్నది. గోదావరి జలాలు నిలిచిపోవడంతో ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.35 వేలు నష్టపోయారు. కొద్దోగొప్పో నీళ్లు పడితే పంటలను కాపాడుకోవచ్చన్న ఆశతో వేస్తున్న బోర్లు ఫెయిల్ అవుతుండటంతో మరింత అప్పుల్లోకి కూరుకుపోతున్నారు. వెరసి ఉమ్మడి రాష్ట్రంలో మాదిరి బతుకుదెరువు కోసం వలసలు పునరావృతం అవుతున్నాయి. జిల్లాలో కాళేశ్వరం పరిధిలోగల ఎస్సారెస్పీ ఆయకట్టులో ఇప్పటికే దాదాపు లక్షకుపైనే ఎకరాలు ఎండిపోయింది. అప్పుల భారానికి తోడు ఊళ్లో పని లేకపోవడంతో రైతన్న కుటుంబ పోషణ కోసం ఇతర ప్రాంతాలకు వలస పోతున్నాయి. ఒక్క పెన్‌పహాడ్ మండలంలోనే 85 శాతం వరి ఎండిపోయింది. ఈ క్రమంలో 67 కుటుంబాలు ఉన్న రత్యా తండాలో 40కిపైనే కుటుంబాలు బతుకుదెరువు కోసం వలసలు వెళ్లాయి. కేసీఆర్ సర్కారు ఉన్నన్నినాళ్లు పొలాల్లో నీళ్లు జాలువారాయని, ఇప్పుడు చూద్దామన్నా చుక్క నీరు కనిపించడం లేదని గిరిజన రైతులు ఆవేదన చెందుతున్నారు. కేసీఆర్ హయాంలో రైతు కుటుంబాలు కొద్దికొద్దిగా చేయి తిప్పుకోగా, కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం నీళ్లు బంద్ చేసింది. కాల్వలు ఎండిపోయాయి. చెరువులు చుక్కనీళ్లు లేవు. మళ్లీ నీటి కరువు.. విద్యుత్తు కోతలు.. ఎరువుల కొరత వంటి సమస్యలు పునరావృతమయ్యాయి. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో పదేండ్లపాటు కేసీఆర్ చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయి. ప్రధానంగా వ్యవసాయం, అనుబంధ వృత్తులు జీవం పునరుజ్జీవం పోసుకోవడంతో అందరికీ చేతినిండా పని దొరికింది. ఆ రోజుల్లో గత ఉమ్మడి రాష్ట్ర దుస్థితి గుర్తుకు వస్తేనే అదో పీడకలలా భావించేవారు. ఆ చీకటి రోజులు నేడు కాంగ్రెస్ పాలనలో మళ్లీ వచ్చాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. సూర్యాపేట జిల్లాలో కాళేశ్వరం పరిధిలోని ఎస్సారెస్పీ ఆయకట్టు గ్రామాల్లో ఏ రైతును కదిలించినా గోడు వెల్లబోసుకుంటున్నాడు.

### ఎవరిని పలుకరించిన వలస మాటే..

ఈ యాసంగిలో నీళ్లు రాకపోవడంతో 1,350 ఎకరాలు ఎండిపోగా 150 ఎకరాల వరకు బోర్లతో పంటను కాపాడుకుంటున్నట్టు పెన్‌పహాడ్ మండల పరిధిలోని రత్యాతండా రైతులు తెలిపారు. 'నమస్తే తెలంగాణ' ఆ తండాలో పర్యటించిన సమయంలో ఏ రైతును కదిలించినా.. 'నా కొడుకు పని కోసం పట్నం పోయిండు.. నా మనుమడు వలస పోయిండు.. మా ఆయన పని కోసం దూరం పోయిండు' అనే సమాధానమే వచ్చింది. సాగు నీరు లేక పదెకరాల్లో ఎనిమిది, ఐదెకరాల్లో నాలుగు ఎకరాలు ఎండిపోయిందని రైతు కుటుంబాలు వాపోయాయి.సొంత ఊళ్లోనే కాదు మండలంలో కూడా చేసేందుకు పనిలేక చాలా మంది చిట్యాల, వరంగల్, ఖమ్మం, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వలస వెళ్లి జీవనం సాగిస్తున్నారు. 40 రైతు కుటుంబాల్లో ఇంటికి ఒక్కరు, ఇద్దరు చొప్పున వలస పోగా మరో 15 నుంచి 20 కుటుంబాలు సూర్యాపేట, కోదాడ పట్టణాలకు వెళ్లి రోజువారీ కూలీ పని చేసి తిరిగి తండాకు వస్తున్నాయి.



రత్యాతండాకు చెందిన రమేశ్, సునీత దంపతులు చిట్యాలకు వలస వెళ్లడంతో ఇంటికి వేసిన తాళం

### నాలుగెకరాలు ఎండింది



నాలుగెకరాలు సాగు చేస్తే మొత్తం ఎండిపోయింది. మా ఇంట్లో ముగ్గురు కొడుకులు కుటుంబాలను పోషించుకునేందుకు వరంగల్‌కు వలస పోయింండ్రు. నాకు 70 ఏండ్లు దాటినయి. గతంతో ఎప్పుడూ నా భూమికి నీళ్లు రాలేదు. కేసీఆర్ సారు ఉన్నప్పుడు కాల్వల్లో నీళ్లు వచ్చినయ్. ఆరేండ్లు మస్తు నీళ్లు చూసినం. నా జీవితంలో అట్ల చూస్త అనుకోలేదు. ఇయ్యాల ఏమైందో గానీ నీళ్లు రాక మళ్లీ కన్న బాధలు పడుతున్నం. ఊరికి కరువొచ్చింది.. పంటలన్నీ ఎండుతున్నయ్, పోరలు పనికి పట్నం పోతున్నరు.

**- భూక్యా భగవాన్, రత్యాతండా, పెన్‌పహాడ్ మండలం**

- మూడు బోర్లేసినా చుక్క నీరు పడలే



నాకున్న ఐదెకరాల్లో రెండు బోర్లల్లో నీళ్లు పుష్కలంగా ఉండటంతో మూడెకరాల్లో వరి సాగు చేసిన. మిగిలిన రెండెకరాలు బీడుగా ఉంచిన. ఒక్కసారిగా బోర్లు వట్టిబోయాయి. పంటను కాపాడుకోవాలనే తపనతో రూ.లక్ష అప్పు తెచ్చి.. వారం రోజుల్లో వేర్వేరు చోట్ల మూడు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. దీంతో పంట ఎండిపోతున్నది. సాగు కోసం లక్ష అప్పు అయ్యింది. ఇప్పుడు రూ. 2 లక్షలు అప్పు ఎలా చెల్లించాలో అర్థం కావడం లేదు.

– సంద రాజు, రైతు, ధన్వాడ, నారాయణపేట జిల్లా



- ట్రాన్స్‌ఫార్మర్‌ను మీరే రిపేర్ చేసుకోండి!

షాబాద్, మార్చి 22: 'ట్రాన్స్‌ఫార్మర్‌ను మీరే రిపేర్ చేసుకోండి.. మేము వచ్చి చేయాలంటే కుదరదు' అంటూ విద్యుత్తు అధికారులు సూచిస్తున్నారని రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం ముద్దెంగూడ రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నెల రోజుల నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ తక్కువ ఉన్నదని, కొత్త ఆయిల్ తెచ్చి పోయాలని చెప్తే ఎవరూ పట్టించుకోవడం లేదంటున్నారు. ఆయిల్ పోయకపోవడంతో లోవోల్టేజీ కారణంగా మోటర్లు నడవడం లేదని, ఇదే విషయమై అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని చెప్తున్నారు.

# పంట ఎండిందని రైతు ఆత్మహత్య

- బోర్లేసినా నీళ్లు పడలేదని ఆవేదన
- 3 లక్షలు అప్పు అయ్యిందని మనస్తాపం
- మెదక్ జిల్లాలో రైతు బలవన్మరణం



కౌడిపల్లి, మార్చి 22 : నీళ్లు లేక పొలం ఎండిపోవడం, బోర్లేసినా చుక్క నీరు రాకపోవడం.. అప్పులు మీద పడటంతో తీవ్ర మనస్తాపం చెందిన ఓ రైతు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మెదక్ జిల్లాలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌడిపల్లి మండలం కుషన్‌గడ్డ తండాకు చెందిన రైతు దేవుల నాయక్ (50)కు నాలుగున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. కాగా మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. సొంత పొలం రెండెకరాలు ఎండిపోయింది. దీని కోసం ఇటీవల మూడు బోర్లు వేయించగా, నీళ్లు పడలేదు. దీంతో రూ.3 లక్షల అప్పులు అయ్యాయి. దీంతో కొద్దిరోజులుగా దిగులుగా ఉంటున్నాడు. శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. శుక్రవారం కుటుంబసభ్యులు వెతకగా జాడ తెలియరాలేదు. శనివారం రాజిపేట శివారు అడవిలో చెట్టుకు ఉరివేసుకొని వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

### విద్యుత్తు షాక్‌తో రైతు మృతి

వెల్దుర్తి, మార్చి 22 : విద్యుత్తు మోటర్‌ను ఆఫ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్తు షాక్ తగిలి రైతు మృతిచెందాడు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మంగళపర్తిలో రైతు దశరథ్ (54) శనివారం ఉదయం తన వ్యవసాయ పొలం వద్ద మోటర్‌ను ఆఫ్ చేయడానికి వెళ్లగా, విద్యుత్తు షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

- చివరి తడికి నీళ్ల చింత



చివరి తడికి సాగునీరందక చేతికొచ్చే దశలో వరి ఎండిపోతున్న దుస్థితి మహబూబాబాద్ జిల్లా బయ్యారం, గార్ల మండలాల్లోని పలు గ్రామాల్లో నెలకొన్నది. పాలవాగు ఆధారంగా గార్ల మండలం దేశ్యతండా, సత్యనారాయణపురం గ్రామాల్లో 50 ఎకరాల్లో వరి సాగు చేశారు. నాట్లుపడే సమయంలో వాగులో నీరుంది. కొద్దిరోజులుగా అడుగంటుతుండటంతో పొట్ట దశలో ఉన్న వరికి నీరందక ఎండిపోతున్నది. -బయ్యారం

- నీళ్లు లేకపాయె.. పంట ఎండిపాయె..



వనపర్తి జిల్లా నాగవరం తండా రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. పక్షం రోజుల్లోనే 25 మందికి బోర్లలో నీటిమట్టం గణనీయంగా తగ్గడంతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. పొట్టదశలో ఉన్న సమయంలో నీళ్లు అందకపోవడంతో పంటలు ఎండుతున్నాయని వాపోతున్నారు. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో రైతు సుజాత ఎండిన వరిని పశుగ్రాసం కోసం కోసేసింది. – వనపర్తి, నమస్తే తెలంగాణ

- చుక్క నీరు లేని రత్నగిరి దేవుని చెరువు



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామంలో చుక్క నీరు లేకుండా దేవుని చెరువు ఎండిపోయింది. భీమదేవరపల్లి నుంచి రత్నగిరి మీదుగా కొప్పూరు గద్దల బండ రహదారి ప్రాంతమంతా ఏటా వరి వేస్తారు. ఎప్పటిలాగే ఈ సారి కూడా రైతులు వరి సాగు చేయగా, పంట చేతికచ్చే సమయానికి వ్యవసాయ బావుల్లో నీరు అడుగంటిపోయింది. రెండు తడులు పెడితే పంట చేతికివచ్చేదని, చేసేదిలేక పొట్టకొచ్చిన వరిని రైతులు పశువుల మేతకు వదిలిపెడుతున్నారు. చెరువులు, కుంటలు ఇప్పటికే ఎండిపోయాయని, రానున్న రోజుల్లో తాగునీటికి సైతం తిప్పలు తప్పవని రైతులు ఆవేదన చెందుతున్నారు. – భీమదేవరపల్లి